విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

శనివారం 05 జూలై 2025 8 పేజీలు

జలజీవన్ మిషన్ పనులపై దృష్టి సారిస్తాం

రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్

విశాలాంధ్ర-మార్కాపురం : ప్రకాశం జిల్లాలో జల జీవన్ మిషన్ పనులు పూర్తయ్యేలా తాను ప్రత్యేక దృష్టి సారిస్తానని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, పంచాయతి రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చెప్పారు. సంవృద్ధిగా నీరు వుండి, వలసలు లేని ప్రకాశం జిల్లాను తాను కోరుకుంటున్నట్లు చెప్పారు. రూ. 1290 కోట్లతో ఈ పథకం కింద చేపట్టే పనులకు శుక్రవారం మార్కాపురంలో ఆయన అ జిల్లా ఇంచార్జ్ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో కలిసి శంఖుస్థాపన చేశారు. ఇదే కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాల వేసి ఉప ముఖ్యమంత్రి నివాళి అర్పించారు. ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ గుంటూరు, కర్నూలు, నెల్లూరు మూడు జిల్లాల్లోని వెనుకబడిన ప్రాంతాలను సమకూర్చి దశాబ్దాల క్రితం ప్రకాశం జిల్లాను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ప్రకాశం జిల్లాలో అన్నీ ప్రాంతాలు నాటి నుండి నేటి వరకు వెనుకబడిన ప్రాంతాలని, అలాగే దాహార్తికి ఎదురుచూస్తున్న ప్రాంతాలని అన్నారు.

జిల్లాలోని దొనకొండ ప్రాంతంలో లక్షలాది ఎకరాలు ఖాళీగా ఉన్నాయని, ఈ ప్రాంతంలో పరిశ్ర మలు ఏర్పాటు చేస్తే ఈ జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని రాష్ట్ర విభజన సమయంలో చెప్పడం జరిగిదన్నారు. ఈ ప్రాంతంలోని వెలుగొండ ప్రాజెక్టు పూర్తీ అయితే ఈ జిల్లా లోని అన్నీ ప్రాంతాల్లో ప్రాజెక్టు ద్వారా సస్యశ్యామల మౌతుందని మంత్రి తెలిపారు. - మిగతా 2 లో

సమస్యలను సమన్వయంతో

సర్దుకుపోవాలి

-రాష్ట్ర, జిల్లా అభివృద్ధే ధ్యేయంగా పనిచేయండి

-బాలినేనిని ఉద్దేశించి పవన్ రాజకీయ వ్యాఖ్యలు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : కుటుంబంలో కొత్త సభ్యులు చేరినప్పుడు చిన్నచిన్న సమస్యలు రావడం సహజమే. వాటిని సమన్వయంతో సర్దుకుపోవాలని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని ఉద్దేశించి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. శుక్రవారం మార్కాపురంలో జలజీవన్ స్కీం ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయన జిల్లా నాయకులతో ఆప్యాయంగా పలకరించారు. ఒక్కొక్కరిని అలింగనం చేసుకుంటూ యోగక్షేమాలు అడిగారు. ప్రతి ఒక్కరిని పేరుపెట్టి సంబోధిస్తూ ఆకట్టుకున్నారు. అనంతరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఇటీవల వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరిన మాజీ మంత్రి బాలినేనిపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. కుటుంబంలో కొత్త సభ్యులు వచ్చినప్పుడు చిన్న చిన్న సమస్యలు ఉండటం సహజం. అయితే రాష్ట్ర అభివృద్ధి, జిల్లా ప్రయోజనాలు దృష్ట్యా సర్దుకుపోవాలని నేతలకు సూచించారు. బాలినేని గత వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా చేశారు. తాను చెప్పదలచింది సూటిగా చెప్పే వ్యక్తి. ఆయనతో మంచి సత్సంబంధాలు కలిగివున్నాయి. వ్యక్తిగతంగా ఎవరితోను తనకు విభేదాలు లేవని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితో కూడా వ్యక్తిగతంగా తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బంది కల్గిస్తేనే ప్రశ్నించానే తప్ప అంతకు మించి తనకు ఎలాంటి అభిప్రాయం లేదన్నారు. బాలినేని బలంగా నిలబడే వ్యక్తి అని, సమస్యలపై పూర్తిస్థాయి అవగాహన కలిగివున్న నాయకుడని తెలిపారు. రాజకీయాలు సరిగ్గా ఎలా చేయాలో బాగా తెలిసిన వ్యక్తి బాలినేని అని, కక్ష్య సాధింపులకు వెళ్లకుండా ఇచ్చి పుచ్చుకునే ధోరణి కలిగిన వ్యక్తి అని అన్నారు. రాజకీయాల్లో కొత్త సభ్యులు వచ్చినప్పుడు కొన్ని ఇబ్బందులు ఉంటాయి, వాటిని సర్దుకుని సమన్వయంతో 2లో

ఇంటింటా సోలార్ పలకలు

- ➤ ప్రభుత్వం,బ్యాంకుల సమన్వయంతో సబ్సిడీలు
- ➤మిగులు విద్యుత్తును సైతం ప్రభుత్వమే కొనుగోలు
- ➤ ప్రజలపై తగ్గనున్న విద్యుత్ ఛార్జీల భారం
- ➤కామేపల్లిలో రూ.43లక్షలతో జల్ జీవన్ మిషన్ కు భూమిపూజ
- ➤రూ.40లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు ప్రారంభం
- ➤మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడి

విశాలాంధ్ర - సంతమాగులూరు : ప్రజలపై విద్యుత్ చార్జీల భారం తగ్గించేందుకు సోలార్ పలకలను అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.ఇప్పటికే ఈ ప్రక్రియ రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైందని,ఇందుకు వినియోగదారుల సహకారం కూడా తోడైతే మరింత వేగంగా పథకం అమలు చేయడానికి అవకాశం ఉంటుందని చెప్పారు.శుక్రవారం సంతమాగులూరు మండలం కామేపల్లిలో సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. తొలుత కూటమి నేతలు,ప్రజాప్రతినిధులు,అధికారులు,గ్రామస్థులు ఆధ్వర్యంలో మంత్రి గొట్టిపాటికి ఘనస్వాగతం పలికారు.నేతలతో కలిసి మంత్రి కామేపల్లిలో ప్రతిగడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు అమలు జరుగుతున్న మిగతా 2 లో ...

ఉత్సాహంగా సీపీఐ మహాసభ

- ☞ పేదలకు అండ సీపీఐ
- ☞ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ
- ☞ పోరాటాలతోనే హక్కుల సాధన
- ☞బాపట్ల జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల శామ్యూల్
- ☞కదం తొక్కిన కార్యకర్తలు
- ☞ఎరుపుమయమైన వాడరేవు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : సీపీఐ చీరాల మండల రెండవ మహాసభ మండలంలోని వాడరేవు గ్రామ పంచాయితీ పరిధిలో సముద్ర తీరం వద్దనున్న కమ్యూనిటీ హాలులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా లైట్‌హౌస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన దిమ్మ వద్ద జెండాను సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల శామ్యూల్ ఆవిష్కరించారు. అనంతరం అధిక సంఖ్య లో హాజరైన మహిళా కార్యకర్త లు ర్యాలీగా కమ్యూనిటీ హాలుకు చేరుకున్నారు. ఈ మహాసభకు చీరాల మండల కార్యదర్శి కె.వీరాంజనేయులు అధ్యక్షత వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ మాట్లాడుతూ సీపీఐ పార్టీని 1925వ సంవత్సరం డిసెంబర్ నెల 26వ తేదీన కాన్పూర్‌లో స్థాపించినట్లు తెలిపారు. 100 సంవత్సరాలు ఒక పార్టీ మనుగడ సాగించడం అద్భుతమైన విషయం అన్నారు. ప్రారంభించబడిన కొద్ది కాలానికే చాలా పార్టీలు మనుగడలో లేకుండా పోయాయన్నారు. ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తూ, స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యానంతరం పేద ప్రజల పక్షాన నిలిచింది సీపీఐ పార్టీ అన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర, కేంద్ర వ్యాప్తంగా సీపీఐ పార్టీ దేశవ్యాప్తంగా ప్రతి చోట ఉన్నదని అన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చెయ్యడానికి ప్రభుత్వాలు ప్రయత్నిస్తుంటే 1600 రోజులుగా కార్మికులు ఉద్యమిస్తున్నారని, దానికి భయపడి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు కట్టపెట్టడానికి ఆలోచిస్తున్నదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కొందరు ప్రైవేట్ వ్యక్తుల పరం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. నరేంద్ర మోడీ ప్రధాని కాకముందు ఎన్నికల ప్రచారంలో విదేశాల్లో ఉన్న నల్ల ధనాన్ని వెనక్కి తెచ్చి ప్రతి ఒక్కరికీ 15 లక్షల రూపాయలను జమ చేస్తామన్నారని, కానీ ఇప్పుడు ప్రతి ఒక్కరి తలపై రెండు లక్షల రూపాయల అప్పు ఉన్నదని అన్నారు. బుర్ల వెంకట్ రావు, భ్రమర రియల్ ఎస్టేట్ రామచంద్రరావుల వ్యాపారం అభివృద్ధి చెందడానికి 9గ్రామాలలో నివసించే 30 వేలమంది మత్స్యకారులను ఇబ్బంది పెట్టే విధంగా సీ మౌత్ కాలువను రాళ్ళతో పూడుస్తున్నారని సమైక్యంగా అందరూ కలిసి ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తపేట మాజీ సర్పంచ్ ఊటుకూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం పోరాడి సాధించుకున్న హక్కులను పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి హక్కులను హరిస్తున్నారన్నారు. మిగతా 2 లో ...

సమస్యలను సమన్వయంతో
సర్దుకుపోవాలి

(మొదటిపేజీ తరువాయి)

ముందుకెళ్లాలని వేదికపై ప్రస్తావించారు. అదే వేదికమీద జనసేన నాయకులతో పాటు తెలుగుదేశం పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. ఇక్కడ విషయం ఏమిటంటే ఒంగోలు నియోజకవర్గం ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌కు బాలినేని శ్రీనివాసులరెడ్డి మీద రాజకీయంగా పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే ఉన్న పరిస్థితులు ఉన్న నేపథ్యంలో కూటమి నేతలందరూ కలిసిపనిచేయాల్సిందేనన్న సంకేతాన్ని పవన్ ఇవ్వడంతో జిల్లాలో రాజకీయ చర్చ మొదలైంది. మొదటిసారి ఒకే రాజకీయ వేదికపై అటు బాలినేని శ్రీనివాసరెడ్డి ఇటు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ వేదిక పంచుకోవడం కూడా అందరిలో ఆసక్తి నెలకొనివుంది.

ఇంటింటా సోలార్ పలకలు

తీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు.ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు.అలాగే కూటమి ఏడాది పాలనపై కరపత్రాలు పంపిణీ చేశారు.అనంతరం గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు ప్రారంభించారు.అదేవిధంగా రూ.43లక్షలతో ఏర్పాటు చేయనున్న జల్ జీవన్ మిషన్ పథకానికి భూమిపూజ చేశారు. దీంతో పాటు సభా వేదిక వద్ద ప్రజాదర్బార్ నిర్వహించి,ప్రజల నుంచి వినతిప త్రాలు స్వీకరించారు.మంత్రి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీల ను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

- సోలార్ పలకలతో విద్యుత్ ఆదా :

రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా సోలార్ పలకలతోనే ప్రతి ఇంటికి వెలుగులు నింపనున్నాయని చెప్పారు.అన్ని వర్గాల ప్రజలు సోలార్ వాడకంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.వీటి ఏర్పాటుకు ప్రభుత్వం,బ్యాంకుల ద్వారా సబ్సిడీలు ఇస్తుందని చెప్పారు.ఆ దిశగా గ్రామంలో ఉన్న బ్యాంకర్లకు అవగాహన కార్యక్రమాలు చేపడతామని వివరించారు.సోలార్ ద్వారా మీ ఇంటి అవసరాలకు పోను మిగులు విద్యుత్తును ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు.ఆ డబ్బును వినియోగదారుల ఖాతాలో జమ చేయడం జరుగుతుంద న్నారు.అంతేకాకుండా స్థానికంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ఉపకేంద్రాల వద్ద సోలార్ ప్లాంట్లు సైతం నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈకార్యక్రమంలో సంతమాగులూరు ఏఎంసీ చైర్మన్ తేలప్రోలు రమేష్,తహశీల్దార్ రవిబాబు,ఎంపీడీవో జ్యోతిర్మయి,విద్యుత్ ఏఈ దీపక్ రెడ్డి,సీఐ వెంకట్రావు,ఎస్సై పట్టాభిరామయ్య, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు సన్నెబోయిన గురయాదవ్,డీసీ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు,మాజీ ఎంపీపీ సన్నెబోయిన ఏడుకొండలు, సర్పంచులు జిర్రా విజయబాబు, రంగనాథబాబు,మండల టీడీపీ నేతలు చేవూరి వాసురెడ్డి,చింతా రామారావు,శ్రీధర్ గమిడి కోటేశ్వరరావు, దుద్దేల చిన్నగాలెయ్య,నక్కా వెంకటేశ్వర్లు,నారదాసు శీనుబాబు,దమ్ము శ్రీను,కంచేటి మురళి,మాదాల సుబ్బారావు,గుండపనేని సురేష్,చిరుమామిళ్ల మాధవరావు,అనంతవరపు దేవా,మహిళా నేత కొనికి సుజాత,గొట్టిపాటి అభిమానులు పాల్గొన్నారు.

మార్కాపురం జిల్లా ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నం: మంత్రి డోలా

విశాలాంధ్ర-మార్కాపురం : పశ్చిమ ప్రకాశం ప్రజల దాహార్తిని తీర్చేందుకు 2018 కి ముందే నాటి ఎన్డీఏ ప్రభుత్వం రూ. 650 కోట్లు కేటాయించిందని కానీ గత వైసీపీ పాలకులు పట్టించుకోకుండా గాలి కొదిలేసారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం నాడు ప్రకాశం జిల్లా మార్కాపురం సమీపంలోని నరసింహపురంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో కలసి అతి పెద్ద తాగునీటి సరఫరా ప్రాజెక్టుకు శంకుస్థాపన కార్యమంలో మంత్రి స్వామి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశం ప్రజల దాహార్తిని తీర్చేందుకు 2018కి ముందే నాటి ఎన్డీఏ ప్రభుత్వం ఈ త్రాగునీటి సరఫరా ప్రాజెక్టుకు రూ. 650 కోట్లు కేటాయించింది. కానీ గత వైసీపీ పాలకులు 5 ఏళ్ల ఈ ప్రాజెక్టును పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారు. వైసీపీ పాలకుల వల్లే నేడు ఈ ప్రాజెక్టు వ్యయం నేడు రూ.1290 కోట్లకు పెరిగింది, ఈ పాపం జగన్ ది కాదా ? 2019 లో మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఉంటే ఈపాటికి ప్రాజెక్టు పూర్తయ్యేది. అవినీతి రహిత పాలనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఈ సందర్భంగాఈ ప్రాజెక్టు ఫేజ్ 2 కింద తూర్పు ప్రకాశం ప్రాంతానికి కూడా త్రాగునీరు అందించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి కోరారు.

ఉత్సాహంగా సీపీఐ మహాసభ

(మొదటిపేజీ తరువాయి)

తులపై చట్టాలను రైతుల ఉద్యమంతో భయపడి ఉపసంహరించు కున్నప్పటికి వేరే రూపంలో తేవడానికి ప్రభుత్వాలు ప్రయత్నం చేస్తున్నాయని, సంఘటితంగా ఉంటూ ఎదుర్కోవలసిన అవసరం ఉందన్నారు. గాదె హరిహరరావు మాట్లాడుతూ ఉచితాలకు ఆశ పడకుండా కుటుంబ అభివృద్ధికి ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. బీరం సుందర రావు మాట్లాడుతూ వాడరేవు పిడుగురాళ్ల రోడ్డును జాతీయ రహదారికి కలుపుతూ ఈ ప్రాంత అభివృద్ధి కోసం నిర్మిస్తున్నట్లు చెబుతున్నారని, కానీ రానున్న కాలంలో పేదల ఇండ్లు పోయి పారిశ్రామిక వేత్తల కర్మాగారాలు వస్తాయని, వాటిలో కార్మికులుగా పని చేయవలసి వస్తుందని హెచ్చరించారు. అందరూ సమిష్టిగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. సీపీఐ చీరాల నియోజక వర్గ కార్యదర్శి చిరమల ప్రకాష్ బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పార్టీలో చేరి సభ్యత్వ కార్డు పొందాలని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే క్రమంలో సభ్యత్వ కార్డు ఉపయోగకరంగా ఉంటుంది అన్నారు. తల్లికి వందనం పథకంలో భాగంగా మొదటి విడత 13 వేల రూపాయలు, రెండవ విడత 10 వేల రూపాయలు వేశారని వ్యత్యాసం ఎందుకు వచ్చిందో ప్రభుత్వ పెద్దలు తెలపాలన్నారు. వాడ రేవు ప్రాంతంలో ఉపాధిహామీ పథకం పనులు అమలు కావడం లేదని వాటిని ప్రారంభించాలని అన్నారు. బాపట్ల జిల్లా కార్యవర్గ సభ్యులు, ఏఐటియుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా పేదల గృహ నిర్మాణం కోసం పట్టణంలో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్లు స్థలం ఇచ్చి గృహ నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలను ఇస్తామన్నారని, అధికారం లోకి వచ్చిన తర్వాత ప్రభుత్వాన్ని అదే విధంగా ఇచ్చి పేదల గృహ నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. గత వైకాపా ప్రభుత్వంలో జగన్ మోహన్ రెడ్డి పేదల గృహ నిర్మాణం కోసం ఒకటిన్నర సెంటు భూమి ఇస్తుంటే సీపీఐ పార్టీ వ్యతిరేకించి పట్టణాల్లో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేసింది అని గుర్తు చేశారు. ఉత్తర్వులు ఇవ్వడం కాదు వాటిని అమలు చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి గేయ రచయిత దేవరకొండ శ్రీనివాస్, షరీఫ్, కోట వేంకటేశ్వర రెడ్డి, కృష్ణ లు ఆలపించిన విప్లవ గీతాలు ఆహుతులను అలరించాయి. నూతనంగా సభ్యత్వం తీసుకున్న వారికి సభ్యత్వ కార్డులు ఇచ్చి ప్రతిజ్ఞ చేయించారు. చీరాల మండల కమిటీని ఎన్నుకున్నారు. చీరాల మండల కార్యదర్శిగా సైకం రాజశేఖర్, సహాయ కార్యదర్శిగా దేగల పున్నారావు, ఎన్నికయ్యారు. 13 మంది సభ్యులు, ఇద్దరు ఆహ్వానితులుగా మేడా వెంకట్రావు, శ్రీమన్నారాయణ 15 మందితో కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పృధ్వి కోట సుబ్బారావు, శ్రీమన్నారాయణ, ఎస్ శాంతి, చీరాల ఏఐటియుసీ అధ్యక్ష కార్యదర్శులు దేవతోటి నాగేశ్వరరావు,బాసి పైడయ్య, సుఖేశ్వర రావు,శివ, సాంబశివరావు, లక్ష్మీ, నాగమణి, జయమణి, అధిక సంఖ్యలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనులపై దృష్టి సారిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

వెలుగొండ ప్రాజెక్టు పూర్తి అయితే ప్రకాశం జిల్లాతో పాటు ప్రక్కన నెల్లూరు జిల్లా లోని ఉదయగిరి, ఆత్మకూరు ప్రాంతాలకు కూడా సాగునీరు, త్రాగు నీరు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనతో వెలుగొండ ప్రాజెక్టు ప్రాధాన్యతను గుర్తించడం జరిగిందన్నారు. జల్ జీవన్ మిషన్ కింద కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు కేటాయిస్తే, గత ప్రభుత్వం కేవలం రెండు వేల కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేయడం జరిగిందన్నారు. నేడు ప్రకాశం జిల్లాలో 578 పశ్చిమ ప్రాంత ఆవాసాలకు రక్షితనీటి సరఫరా చేయుటకు 1290.00 కోట్ల అంచనా వ్యయంతో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా చేపట్టనున్న ఈ ప్రాజెక్టు శంఖుస్థాపనకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి రావడం ఎంతో సంతోషదాయకమన్నారు. రానున్న రోజుల్లో ప్రకాశం జిల్లాను అన్నీ రంగాల్లో అభివృద్ధి చేయడానికి ఈ ప్రభుత్వం అన్ని రకాలుగా పనిచేస్తున్నదన్నారు. డోలా బాల వీరంజనేయ స్వామి మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశం ప్రజల దాహార్తిని తీర్చేందుకు 2018కి ముందే నాటి ఎన్డీఏ ప్రభుత్వం ఈ త్రాగునీటి సరఫరా ప్రాజెక్టుకు రూ. 650 కోట్లు కేటాయించిందని, 2019 లో మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఉంటే ఈపాటికి ప్రాజెక్టు పూర్తయ్యేదన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నేడు ఈ ప్రాజెక్టు వ్యయం నేడు రూ.1290 కోట్లకు పెరిగిందన్నారు. ఏడాదిలోనే ప్రకాశం జిల్లాలో రూ.165 కోట్లతో సిమెంట్ రోడ్లు, సైడ్ కాలువలు నిర్మాణం చేశామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగకుండా వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రజల చేతిలోకి సేవలందిస్తున్నామని, ఇచ్చిన మాటకు ప్రకారం ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం ఇస్తున్నామన్నారు. అవినీతి రహిత పాలనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంద=ని మంత్రి అన్నారు. ఈ ప్రాజెక్టు ఫేజ్ 2 కింద తూర్పు ప్రకాశం ప్రాంతానికి కూడా త్రాగునీరు అందించాలని ఈ సందర్భంగా మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ని కోరడమైనది. మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి జలజీవన్ మిషన్ పథకం కింద రూ.60 వేల కోట్లను కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.2వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. ఈ క్రమంలో ప్రకాశం జిల్లాలో ఈ ప్రాజెక్టు కింద పనులు చేపట్టేందుకు ఉపముఖ్యమంత్రి వచ్చి శంకుస్థాపన చేయటం సంతోషకరమన్నారు. ప్రకాశం జిల్లాలో రెండో విడతను కూడా ఈ పథకం కింద చేపట్టేలా ఉప ముఖ్యమంత్రి ఆలోచిస్తున్నట్లు మాగుంట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో వెనుకబడిన ప్రకాశం జిల్లాపై, ప్రధానంగా పశ్చిమ ప్రాంతముపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఇంచార్జి జిల్లా కలెక్టర్ ఆర్. గోపాల క్రిష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో అత్యధికంగా నీటి ఎద్దడి కలిగిన జిల్లాల్లో ప్రకాశం జిల్లా ఒకటని, ముఖ్యంగా మార్కాపు రం, కనిగిరి, గిద్దలూరు, ఎర్రగొండపాలెం ప్రాంతా లలో తీవ్రమైన త్రాగు నీటి కొరత ఉందని, ఈ త్రాగునీటి సమస్యలకు స్వల్పకాలిక పరిష్కారంగా గత రెండు దశాబ్దాలుగా త్రాగునీటిని ట్యాంకర్ల ద్వారా దాదాపు 70 శాతం ఆవాసాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఒంగోలు, కనిగిరి, గిద్దలూరు, ఎస్ ఎన్ పాదు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ రావు, డా. ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి, ముత్తుముల అశోక్ కుమార్, బి ఎన్ విజయకుమార్, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డా నూకసాని బాలాజీ, రాష్ట్ర వ్యవసా య మిషన్ వైస్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఏపీ లైవ్ స్టాక్ డెవలప్ మెంట్ ఏజెన్సీ చైర్మన్ శ్రీ షేక్ రియాజ్, ఎపి మాల వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డా విజయకుమార్, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జల శక్తిమిషన్‌లో తాగునీటి అవసరాలకు శాశ్వత పరిష్కారం

-డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు -డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

విశాలాంధ్ర-దర్శి : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో మన ప్రియతమ ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు కృషితో ఉపముఖ్యమంత్రి వర్యులు కొణిదల పవన్ కళ్యాణ్ ప్రకాశానికి ప్రకాశాన్నిచ్చే మణిహారమైన జల శక్తి మిషన్ ప్రాజెక్టు తొలి విడత కార్యక్రమాన్ని మార్కాపురంలో ప్రారంభించడం ఒక శుభ పరిణామం. జల శక్తి మిషన్ ద్వారా తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపించే ఈ ప్రాజెక్టు 1290 కోట్ల రూపాయలతో ఉప ముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. ఆ ప్రాజెక్టులో మన దర్శి నియోజకవర్గాన్ని కూడా చేర్చడం, తద్వారా జల శక్తి మిషన్ ప్రాజెక్టులో గ్రామ గ్రామానికి తాగునీరు అందించే ముహూర్తమైన ఈ కార్యక్రమాన్ని చేపట్టడం కూటమి ప్రభుత్వంలో అభివృద్ధిలో ఒక మైలురాయిగా చెప్పవచ్చు. ఈ సందర్భంగా దర్శి ప్రజల తరపున పవన్ కళ్యాణ్ కి ప్రత్యేకంగా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. 20 నెలల్లో ఈ ప్రాజెక్టు పూర్తయ్యే లక్ష్యంగా స్వయంగా పవన్ కళ్యాణ్ ఈ ప్రాజెక్టును పర్యవేక్షిస్తానని ప్రకటించడం ఎంతో గర్వంగా ఉందని గొట్టిపాటి లక్ష్మి అన్నారు. అదేవిధంగా తాగు సాగునీటి అవసరాలు తీర్చి కరువు నివారణకు దోహదపడే వెలుగొండ ప్రాజెక్టును కూడా ముందుకు తీసుకు వెళ్లేందుకు అవసరమైన ఎనిమిది వందల కోట్ల భూసేకరణ కు నిధులు తక్షణమే మంజూరయ్యేందుకు తన వంతు కృషి చేస్తానని పవన్ కళ్యాణ్ ప్రకటించడం పట్ల ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు లక్ష్మి అన్నారు.

మార్క్ కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : పెద్ద దోర్నాల మండలంలోని వైచర్లపల్లి గ్రామానికి చెందిన మార్క్ ఇటీవల కాలంలో అనా రోగ్యంతో మృతి చెందటం జరిగింది. విష యం తెలుసుకున్న 2007 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు అందరూ కలిసి చనిపోయిన మార్కు కుటుంబానికి స్నేహితుల సాకారంతో కొంత ఆర్థిక సహాయం కుటుంబానికి రూ.27,100లు అందించటం జరిగింది. ఈ కార్యక్రమంలో దర్శనం సుధీర్ బాబు (న్యాయవాది), డాక్టర్ కోడి ప్రవీణ్ కుమార్, జగన్ పాల్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. ఇంత గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన మార్కు స్నేహితులైన వారికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

చిన్న పేరయ్యకు ఘన నివాళులు

విశాలాంధ్ర-పామూరు రూరల్ : మండలం లోని మోపాడు టీడీపీ సీనియర్ నాయకులు దివంగత కనిగిరి మాజీ శాసనసభ్యులు ఇరిగినేని తిరుపతి నాయుడు ముఖ్య అనుచరులు పచ్చవ చిన్న పేరయ్య గురువారం మృతి చెందారు. ఇరిగినేని తిరుపతి నాయుడు కుమారులు రాజేంద్రప్రసాద్, కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ లు శుక్రవారం పేరయ్య పార్థివ దేహానికి ఘన నివాళులర్పించారు. పీసీ పల్లి మాజీ సింగిల్ విండో అధ్యక్షులు గద్దం బాలసుబ్బయ్య, లక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్స్ అధినేత వడ్లమూడి నాగేంద్ర, మోపాడు ప్రాజెక్ట్ సూపర్ చైర్మన్ చుంచు కొండయ్య, మన్నం వెంకటస్వామి, బిల్డర్ దారపనేని సుబ్బారావు, మొరుబోయిన గిద్దయ్య యాదవ్, మోరుబోయిన నరసింహ యాదవ్, దేవరపు శ్రీహరి, దేవరపు మాలాద్రి, యారసింగ్ రాయుడు, మట్లే రాహుల్ యాదవ్, మాజీ ఎంపిటిసి సప్పిడి రామయ్య, తదితరులు పేరయ్య అంతిమ యాత్ర లో పాల్గొని నివాళులు అర్పించారు.

మెగా పేరెంట్స్ సమావేశం విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - తాళ్లూరు: మండలంలోని పాఠశాలల్లో ఈనెల 10న నిర్వహించతలపెట్టిన మెగా పేరెంట్స్ సమావేశం విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి-1 జి సుబ్బయ్య, ఎంఈఓ -2 సుధాకర రావులు కోరారు. స్థానిక ఎంఆర్సీ లో శుక్రవారం ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ లు సుబ్బయ్య, సుధాకర్ రావులు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచుకొనుటకు ప్రత్యేక డ్రైవ్ ను కొనసాగించాలని సూచించారు. ప్రోటో కాల్ ప్రకారం సూచనలు పాటిస్తూ ప్రతి కార్యక్రమం విజయవంతం అయ్యేలా కృషి చెయ్యాలని కోరారు.

చెత్త సంపద కేంద్రాలు పరిశీలన

విశాలాంధ్ర -తాళ్లూరు: మండలంలోని మాధవరం, తాళ్లూరు చెత్త సంపద కేంద్రాలను ఒంగోలు డివిఎల్‌పిఓ పద్మ శుక్రవారం పరిశీలించారు. మాధవరంలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి త్వరగా వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పరసరాలను పరిశుభ్రంగా ఉంచటంతో పాటు చెత్త సంపద కేంద్రాల నిర్వహణ ద్వారా పంచాయితీలకు ఆదాయ వనరు చేకూరేలా చూడాలని కోరారు. మాధవరం, తాళ్లూరు గ్రామ కార్యదర్శులు అల్లం వెంకటేశ్వర్లు, ఇడమకంటి వెంకట రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలి

విశాలాంధ్ర -తాళ్లూరు: రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ఎప్పటికప్పుడు ప్రత్యేక చొరవ చూపి పరిష్కారం వేగవంతంగా ఉండేలా చూడాలని తహసీల్దార్ లక్ష్మి నారాయణ అన్నారు. తాళ్లూరు ఆయన కార్యాలయంలో శుక్ర వారం విఆర్ఓలతో సమావేశం నిర్వహించారు. గ్రామ వార్డు సచివాలయాల సేవలు వేగవంతం చెయ్యాలని, హైవేకి భూములిచ్చిన రైతుల పరిహారం ఏవైనా ఇబ్బందులు ఉంటే తక్షణం పరిష్కారం అయ్యేలా చూడాలని కోరారు. గ్రీవెన్స్‌లో వచ్చిన వినతుల పరిష్కారం వేగవంతం చెయ్యాలని కోరారు. రైస్ కార్డుల దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని చెప్పారు. ఇచ్చిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేయ్యాలని సూచించారు. ఆర్ఐ అనూష పాల్గొన్నారు.

రోడ్ల వెంబడి వ్యర్థాలను తొలగించాలి

ఎంపీడీవో హనుమంతరావు

విశాలాంధ్ర-పీసీపల్లి : రోడ్ల పక్కన ఉన్న పేడ దిబ్బలు వ్యర్థాలను వెంటనే తొలగించాలని ఎంపీడీవో హనుమంతరావు అన్నారు. శుక్రవారం మండలంలోని వేప గుంపల్లి వెంగలాయపల్లి గ్రామాలలో ఎంపీడీవో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలాకాలంగా రోడ్ల పక్కన ఉన్న పేడ దిబ్బలు వ్యర్థాలను గుర్తించి వెంటనే తొలగించాలని గ్రామస్తులకు సూచించారు. అనంతరం వాటి వల్ల కలిగే అనర్థాలను వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్ల వెంబడి పేడ దిబ్బలు వ్యర్థాలు ఉండటం వలన వర్షాకాలంలో దోమలు అధికంగా వ్యాప్తి చెందుతాయని తద్వారా ప్రజలు అనారోగ్యం వారిన పడే అవకాశం ఉందని వెంటనే తొలగించాలని హెచ్చరించారు ఎంపీడీవో వెంట డిప్యూటీ ఎంపీడీవో రాంప్రసాద్ పంచాయతీ కార్యదర్శి షర్మిల ఉన్నారు.

ప్రధానమంత్రి జన్మాన్ గృహాలను పరిశీలన

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : ప్రధానమంత్రి ఆవాస్ నిర్మాణ గృహాలను శుక్రవారం గృహ నిర్మాణ శాఖ పిడి పి శ్రీనివాస ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని ఫ్రిడ్జ్ గిరిజన కూడా మర్రిపాలెం గూడెంలో మంజూరైన 74 ఇళ్లను, మర్రిపాలెం లో 20 బేస్మెంట్ లెవెల్ ఉన్నావని పరిశీలించారు. ఈ సందర్భంగా అన్ని గృహాలను పరిశీలించారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పెరుగు శ్రీనివాసప్రసాదు, మార్కాపురం డివిజన్ హౌసింగ్ అధికారి వెంకటరావు,మార్కాపురం డివైఈ, పవన్ కుమారు, యర్రగొండపాలెం డి వై ఈ,సురేష్ బాబు, దోర్నాల మండలము ఏఈ శివశంకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వం రాయితీలను సద్వినియోగించుకోవాలి

మండల వ్యవసాయ అధికారి తిరుమలరావు

విశాలాంధ్ర-ముండ్లమూరు : ప్రభుత్వం రైతులకు అనేక సంక్షేమ పథకాలతో పాటు వ్యవసాయానికి అవసరమయ్యే పరికరాలను రాయితీపై అందజేస్తుందని మండల వ్యవసాయ అధికారి ఏ తిరుమలరావు అన్నారు. మండలంలోని వేముల బండ గ్రామంలో శుక్రవారం రైతులకు పంటల బీమా పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం ఎలా పొందాలి, లాభసాటి వ్యవసాయం చేసేందుకు పలు సూచనలు అందజేశారు. రైతు సేవ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను వినియోగించు కోవాలని కోరారు. కౌలు రైతులు తప్పనిసరిగా సిసిఆర్సి కార్డులు తీసుకోవాలన్నారు. పంట నష్టం జరిగినప్పుడు రైతు పేరు నమోదు చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం తిప్పే స్వామి, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని పెద్ద ఉలగల్లులో నూతనంగా ఏర్పాటు చేయనున్న 33 బై 11 లెవన్ కేవీ విద్యుత్తు సబ్ స్టేషన్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని చూపించాలని ఆ శాఖ దర్శి డివిజన్ ఏ డి ఏ పి రవికుమార్ అన్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసిల్దార్ ఎల్ లక్ష్మీనారాయణ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్తు సబ్ స్టేషన్ ఏర్పాటుకు అనుమతి ఇచ్చిందన్నారు. నిర్మాణం కోసం అనువైన స్థలం లేకపోవడం వలన ఆలస్యం జరుగుతుందని, స్పందించి తక్షణమే సబ్ స్టేషన్ కు అనువైన స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట విద్యుత్ సబ్ ఇంజనీర్ జె ఇమ్మానియేల్ బాబు ఉన్నారు.

పునర్వ్యవస్థీకరణ వాతావరణ ఆధారిత బీమా పథకంను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : పునర్వ్యవస్థీకరణ వాతావరణ ఆధారిత భీమా పథకంను రైతులు సద్వినియోగం చేసుకొని ప్రయోజనం పొందాలని అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఇవి.రమణ తెలిపారు. శుక్రవారం బోయలపల్లి గ్రామంలోని సచివాలయంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రతికూల వాతవరణ పరిస్థితులు, వాటి విపత్తుల నుండి వచ్చే నష్టాలపై ఆర్థిక రక్షణ కల్పించడమే ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ పథకము గురించి ఎటువంటి సందేహాలు ఉన్న రైతులు మీ యొక్క రైతు సేవ కేంద్రాలను గాని, సీఎస్సీ సెంటర్లను గాని, మీసేవ సెంటర్లను గాని, సెల్ నంబర్ 7997550524 కు కాల్ చేసి మీ సందేహాలను నివృత్తి చేసుకోవలసిందిగా కోరుతున్నాము. ఈ పథకానికి 2025 జులై 15 తేదీ వరకు సమయం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పై కేసు నమోదు చేయాలి

విశాలాంధ్ర-దర్శి : గుంటూరు జిల్లా పల్నాడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మాదిగ సామాజిక వర్గానికి చెందిన చీలి సింగయ్యను అసభ్యకరంగా వ్యాఖ్యానించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై ఎస్సీ,ఎస్టీ నిబంధనల ప్రకారం కేసు నమోదు చేయాలని కోరుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం ప్రకాశం అధ్యక్షులు గాలిమూటి దేవప్రసాద్ ఆధ్వర్యంలో దర్శి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దర్శి నియోజకవర్గ అధ్యక్షులు గల్లెపోగు ఏసుదాసు, కురిచేడు మండల ఎస్సీ విభాగం అధ్యక్షులు కేసనపల్లి నాగేశ్వరరావు, తాళ్లూరు మండల ఎస్సీ విభాగం అధ్యక్షులు యామర్తి ప్రభుదాసు, ముండ్లమూరు మండల ఎస్సీ విభాగం అధ్యక్షులు గోపన బోయిన పెద్ద శ్రీను, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుంటు పోలయ్య, క్రిస్టియన్ సెల్ కురిచేడు మండల అధ్యక్షులు ఎం స్టాలిన్ పాల్, నాయకులు కంభంపాటి జోసెఫ్, ఎర్రగుంట్ల మోసే, కే సన్నీ బాబు, బోయలపల్లి అచ్చయ్య, గజ్జ రాజారత్నం పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ధర్నా

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : ఏపీ పిటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మార్కాపురం డిపో ఎదుట యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ భాషా హుస్సేన్ అధ్యక్షతన ధర్నా కార్యక్రమం జరిగినది. ఈ ధర్నాను ఉద్దేశించి జోనల్ సహాయ కార్యదర్శి ఎస్‌వివిఎస్ శాస్త్రి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులందరికీ గత ఆరేళ్లుగా పెండింగ్ లో ఉన్న ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలి, ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 10 వేల మంది సిబ్బంది నియామకాలకు ప్రభుత్వం వెంటనే అనుమతులు ఇవ్వాలని, ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ ఏ సొంతంగా కొనుగోలు చేయాలని, ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ కొరకు దీపోవాలని ప్రైవేట్ ఆపరేటర్లకు లీజ్ కు ఇచ్చే విధానాన్ని విరమించుకోవాలని, ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ సిబ్బందితోనే నడపాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ వెంటనే ప్రకటించాలని, 12వ పీఆర్‌సీ కమిషన్ వెంటనే నియమించాలని ఆర్టీసీ ఉద్యోగుల ఉద్యోగ భద్రతకు సంబంధించిన సర్కులర్ నెంబర్ :01/2019 యధావిధిగా అమలు జరిగేలా స్పష్టమైన ఆదేశాలు వెంటనే ఇవ్వాలని, ఆర్టీసీ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్ లో చేర్చాలని కోరినారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ జనార్దన రావు, జిల్లా ప్రచార కార్యదర్శి శేఖర్ నాయుడు, డిపో అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్లు, నాని ఎడిసి నాగేశ్వరరావు, అల్తాఫ్, గ్యారేజీ కోశాధికారి ఆంజనేయులు, వలి, షేక్షావలి, షహన్వాజ్‌తో పాటుగా అత్యధిక మంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ కనకదుర్గమ్మ అభిషేకాలు

విశాలాంధ్ర-దర్శి: దర్శి పురపాలక సంఘం అద్దంకి రోడ్డు ఎన్ఎస్పీ కాలనీలో వేంచేసి ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి తల్లికిశుక్రవారం తెల్లవారు జామున భక్తులు అభిషేకాలు నిర్వహించితమ భక్తిని చాటుకున్నారు. అన్న వితరణ దాతలు అయినప్రముఖ వ్యాపారవేత్తలు చేకూరి శ్రీధర్ ధర్మపత్ని మాధవీ లత దంపతులు ,వల్లూరు వెంకటేష్ ధర్మపత్ని రమ్యశ్రీ దంపతు లుపూజా కార్యక్రమంలో పాల్గొని కనకదుర్గమ్మ అమ్మవారికి పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు బాలకృష్ణ చారి పూజ జరిపి హారతిఇచ్చి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం వచ్చిన భక్తులకు శ్రీధర్ దంపతులు మరియు వెంకటేష్ దంపతులు అన్న వితరణచేశారు.

ప్రభుత్వ వసతిగృహంలో అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటుచేయాలి

విశాలాంధ్ర-దర్శి : దర్శి ఏఎస్ డబ్ల్యూ కార్యాలయంలో రాష్ట్రదళితసేన ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నూతన దర్శి ఏ ఎస్ డబ్ల్యూ ఆదిలక్ష్మికి సమస్య లతో కూడిన వినతి పత్రం సమర్పించ డం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర దళిత సేన దర్శి నియోజకవర్గం అధ్యక్షులు ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ వసతి గృహాలు చదువుతున్న పేదవిద్యార్థులకు అన్నివసతి గృహంలలో మౌలిక సదుపాయాలతో పాటు దర్శి బాలికలవసతిగృహంలో ఆగిపోయిన పనులనుత్వరగా పూర్తిచేయాల ని, భారత రాజ్యాంగనిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలు ప్రభుత్వం ఇచ్చిన జీవోలను వెంటనే అమలు చేయాలని, ఆయన ప్రభుత్వం డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గంధం ఇర్మియా, పోతవరం మాజీ సర్పంచ్ కోట నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ 26,000 ఇవ్వాలి

విశాలాంధ్ర-పామూరు రూరల్ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి డిమాండ్ చేశారు.ఈనెల 9వ తేదీ జరిగే సార్వత్రిక సమ్మె నోటీసు ఏపీవో మాల్యాద్రి కి ఫీల్డ్ అసిస్టెంట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి కూలీలకు పనులు చూపిస్తూ అండగా ఉంటున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించా లని ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం వర్తింపజేయాలని రాజకీయ తొలగింపు ఆపాలని పర్మినెంట్ ఉద్యోగులుగా నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి వై వి నారాయణ పామూరు ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీను, మహేంద్ర, చిన్నమ్మి, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పేరయ్య మృతి టీడీపీకి తీరని లోటు

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని మోపాడు కు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పచ్చవ చిన్న పేరయ్య మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అని రాష్ట్ర తెలుగుదే శం పార్టీ విభిన్న ప్రతిభావంతుల ప్రధాన కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి అన్నారు. శుక్రవారం పేరయ్య పార్థివ దేహాన్ని సందర్శించి తెలు గుదేశం జెండా ను కప్పి ప్రభాకర్ చౌదరి ఘన నివాళులు అర్పించారు. నివాళులర్పించిన వారిలో మండల తెలుగు రైతు అధ్యక్షులు మన్నం రమణయ్య , మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు రాయవరపు శ్రీకాంత్, బొట్ల గూడూరు గ్రామ పార్టీ అధ్యక్షులు కోటపాటి వెంకటేశ్వర్లు, దారపునేని సుబ్బారావు పచ్చవ బాబు, మోపాడు గ్రామ పార్టీ అధ్యక్షులు మోరుబోయిన గద్దయ్య మరియు యూనిట్ ఇంచార్జ్ తలజాల మాధవరావులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏ.ఈ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. మండలంలోని తాటిచెర్ల మోటు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని తాటిచెర్ల, నాగిరెడ్డిపల్లి, హసనాపురం, దద్దవాడ, ముత్రసుపల్లి, గుండ్రెడ్డి పల్లి, నారాయణ పల్లె, అలసందల పల్లె, గోవిందుల పల్లె, పొట్టి పల్లె, అక్క పల్లె, వెంకటం పల్లె, కంకరవారి పల్లి గ్రామాలలో మరమత్తుల కారణంగా సరఫరా నిలిచిపోతుందని, ప్రజలు సహకరించాలని ఏ.ఈ తెలిపారు.

విద్యుత్ బ్రేకర్స్ ఏర్పాటుతో సమస్యకు పరిష్కారం

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తి మండలం లో కొత్త విద్యుత్ బ్రేకర్స్ ఏర్పాటుతో విద్యుత్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని 20 లక్షల వ్యయంతో 33/11 కెవి సబ్ స్టేషన్ చీమకుర్తి నందు నూతనంగా ఏర్పాటు చేసి ఉన్న రెండవ లెవెన్ కె.వి విద్యుత్ బ్రేకర్ ను మాకినేని హరిబాబు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఒంగోలు వారు శుక్రవారం ప్రారంభించి విని యోగంలోకి తెచ్చారు. ఈ సందర్భంగా హరి బాబు మాట్లాడుతూ లెవెన్ కె.వి విద్యుత్ ట్రా న్స్ఫార్మర్ల వలన ఇప్పటివరకు చీమకుర్తి పట్టణంలో ఉన్న కరెంటు సమస్యలకు పరిష్కారం కలుగుతుందని, అలాగే అంతరాయం లేకుండా కరెంటు ఇచ్చుటకు ఏర్పాటు కలుగునని తెలి పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్. మోహన్ రావు,అసిస్టెంట్ ఇంజనీర్ టీ.చంద్రశేఖర రావు మరియు చీమకుర్తి విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

క్విస్ ఫ్యాకల్టీ 'నిడమానూరి'కి డాక్టరేట్

విశాలాంధ్ర-ఒంగోలు : క్విస్ కళాశాల సీఎస్ ఈ డిపార్ట్ మెంట్ కి చెందిన ఫ్యాకల్టీ నిడమానూరి శ్రీను డాక్టరేట్ అందుకున్నారు. చెన్నైలోని భారత్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ నుంచి ఆయన డాక్టరేట్ పొందారు. "కస్టమర్ ఫీడ్ బ్యాక్ క్లాసిఫికేషన్ యూజింగ్ బై డైరెక్షనల్ లాంగ్ షార్ట్ టర్మ్ మెమోరి అండ్ ఫజ్జిలాజిక్" అంశంలో డాక్టర్ శివరామన్ గైడ్ షిప్ లో రిసెర్చ్ చేశారు. ఈ అంశంపై జాతీయస్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో పేపర్లను పబ్లిష్ చేసి పరిశోధన చేసినందుకు శ్రీనుకి డాక్టరేట్ పట్టా అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిడమానూరి శ్రీనును విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ శ్రీ గాయత్రి అభినందించారు. కార్యక్రమంలో క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు, సీఎస్ ఈ డిపార్ట్ మెంట్ హెచ్ వోడీ డాక్టర్ బుజ్జిబాబు పాల్గొన్నారు. పీహెచ్ డీ చేసేందుకు సహకరించిన కాలేజి యాజమాన్యానికి, హెచ్ వోడీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

పీర్లకు 'దద్దాల' ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-వెలిగండ్ల: మండలంలోని జాళ్ల పాలెం గ్రామంలో మొహర్రం పీర్ల పండుగ సందర్భంగా పీర్లచావిడిని సందర్శించి శు క్రవారం కనిగిరి నియోజకవర్గ ఇంచార్జ్ వైసీపీ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడ్పిటిసి గుంటక తిరుపతిరెడ్డి,గజ్జల తిరుపతిరెడ్డి, సర్పంచ్ శ్యామల కృష్ణారెడ్డి,యక్కంటి ఆదినారా యణ రెడ్డి,ఎర్రబోయిన నాగూర్ యాదవ్,మేడం ఆదినారాయణ రెడ్డి ,ఆవుల తిరుపతిరెడ్డి(ఏటీఆర్),ఎలిక నారాయణ, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు పొల్ల సుబ్రమణ్యం, కందుల వెంకట నారాయణరెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి , రాయల్ల అంజి, చినపీరయ్య, లింగాల సురేష్ , వేల్పుల హరి, సాంబిరెడ్డి, మస్తాన్, సిద్దయ్య ఆర్ఎంపి, మేడిపోయిన నారాయణ, చెన్న కృష్ణ నన్నసామి నారాయణ, వెంకటస్వామి రెడ్డి,మితికాల వెంకట్,ఈర్ల శ్రీను పాల్గొన్నారు.

చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : చెత్త రహిత గ్రామా లుగా తీర్చిదిద్దాలని ఒంగోలు డివిజన్ పంచాయతీ అధికారి ఆర్ పద్మావతి అన్నారు. మండలంలోని కెల్లంపల్లి, ఉలగల్లు, శంకరాపురం గ్రామ పంచాయతీ లను ఆమె ఆకస్మిక తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురుగు కాలవలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. చెత్త కుండీలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పారిశుద్యం పై ఎప్పటికప్పుడు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. వీధులను శుభ్రంగా ఉంచాలని సూచించారు. రోడ్డు వెంబడి ఇరువైపులా చెత్త కుప్పలు ఉండకుండా తొలగించాలని తెలిపారు. ప్లాస్టిక్ కవర్లను మరియు ప్లాస్టిక్ డబ్బాలను వేరువేరుగా చేసి సెగ్రిగేషన్ చేయాలని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ సక్రమంగా చేపట్టాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ సక్రమంగా చేపట్టాలని ఎంపీడీవో పి శ్రీదేవి అన్నారు. మండలంలోని శంకరాపురం గ్రామాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శంకరాపురం గ్రామం ఐఎస్ఆర్ఎస్ గ్రామ పంచాయతీగా ఎన్నిక కాబడినందున ప్రత్యేకంగా సందర్శించడం జరిగింది. ఇండ్లలో నుంచి వచ్చినతడి పొడి చెత్తను వేరుచేసి షెడ్డుకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

చెట్టు నుండి జారి పడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-వెలిగండ్ల: మండలం గుడిపాటి పల్లి గ్రామానికి చెందిన గోనా నాగభూషణం(53) చెట్టును కొట్టే క్రమంలో ప్రమాదవ శాత్తు జారిపడి గాయాల అవ్వగా కనిగిరి హాస్పిటల్కు తీసుకొచ్చే క్రమంలో మార్గ మధ్యలో తుదిశ్వాస విడిచారు నాగభూషణానికి భార్య, నలుగురు ఆడపిల్లల సంతానం కలిగి ఉన్నారని బంధువులు తెలిపారు.

బాపట్ల కలెక్టర్‌కు సీఎం ప్రశంసలు

- పి 4 అమలులో జిల్లా అధికారులు పనితీరు భేష్
- రాష్టంలో బాపట్ల ప్రథమ స్థానం

విశాలాంధ్ర - బాపట్ల : పి4 అమలులో బాపట్ల జిల్లా కలెక్టర్ ప్రణాళిక,సమష్టిగా అధికారుల పనితీరు చాలా బాగుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు.పి4 అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో శుక్రవారం రాజధాని అమరావతి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వీక్షణ సమావేశం నిర్వహించారు.బాపట్ల జిల్లాలో 62,388 బంగారు కుటుంబాలు ఉంటే 44,920 కుటుంబాలను 3,528 మంది మార్గదర్శిలకు దత్తత ఇవ్వడంతో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచారని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రశంసించారు.బంగారు కుటుంబాలను 72 శాతం అనుసంధానించడం అభినందనీయమన్నారు. మిగిలిన 17వేల కుటుంబాలను మార్గదర్శిలకు దత్తత ఇవ్వాలని ఆయన అన్నారు. బాపట్లలోని ఎన్ఆర్ఐలు, ఎన్ఆర్ఏలు, ఆ జిల్లాలో నడిచే కంపెనీల యజమానులను మార్గదర్శిలుగా చేర్చి దత్తత ఇవ్వడం సంతోషదాయకమన్నారు. బాపట్ల జిల్లా యంత్రాంగం సమష్టి కృషిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని సీఎం అన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు బాపట్ల జిల్లాను స్ఫూర్తిగా తీసుకోవాలని సీఎం సూచించారు. ఆగస్టు 15వ తేదీ నాటికి రాష్ట్రాల్లోని 15 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శిలు దత్తత తీసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించి, పేదలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే లక్ష్యం అన్నారు. వారిని పేదరికం నుంచి బయటికి తెచ్చే బాధ్యత మార్గదర్శులు తీసుకోవాలన్నారు. స్వర్ణాంధ్ర పి4 ఫౌండేషన్ పేరుతో విజన్ డాక్యుమెంటరీ చేసుకున్నామన్నారు. నిరుపేద కుటుంబాలకు సరైన సమయంలో, సరైన నిర్ణయాలు, సహకారం అందించడమే మన బాధ్యత అన్నారు. అంతర్జాతీయ బహుళ జాతి కంపెనీలను సైతం అనుసంధానిస్తున్నామన్నారు. పేదరిక నిర్మూలన, సంపద సృష్టించడం వంటి ఆలోచనలతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో పనిచేస్తున్నామని వివరించారు.పి4 విధానంలో బంగారు కుటుంబాలకు చేయూతనందిస్తున్నామని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. 44,920 కుటుంబాలను దత్తత తీసుకోగా, ఇప్పటికే 13 కుటుంబాలకు జీవనోపాధి కల్పించామన్నారు. సమాజంలో బాగా పనిచేసే ఎన్జీవోలను అనుసంధానించాం. మీ సూచనలతో జిల్లా యంత్రాంగం స్ఫూర్తిగా పనిచేస్తుందన్నారు. గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలు నియమించామన్నారు. తద్వారా ఆ కుటుంబాలలోని వారికి నైపుణ్యాలు, కెరియర్ గైడెన్స్ వంటి సేవలు అందిస్తున్నామన్నారు. ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళు‌తున్నామని ముఖ్యమంత్రి కి కలెక్టర్ వివరించారు. ఈ సమావేశానికి జిల్లా నుంచి సిపిఓ షాలేమ్ రాజు, డి ఆర్ డి ఎ పీడీ శ్రీనివాసరావు, ఆర్డీవో గ్లోరియా తదితరులు హాజరయ్యారు.

'అల్లూరి' జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

-జిల్లా ఎస్పీ తుషార్ దూడి

విశాలాంధ్ర - బాపట్ల : అల్లూరి సీతారామ రాజు జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని నేటి యువత నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్ దూడి సూచించారు.మన్యం వీరుడు అల్లూరి సీతా రామ రాజు జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య చరిత్రలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి,సాయుధ పోరాటం ద్వారానే స్వతంత్రం వస్తుందని నమ్మి,దాని కొరకే తన ప్రాణాలర్పించిన యోధుడన్నారు.భారతదేశంలో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా,మన్యం ప్రజల హక్కుల కోసం సాయుధ పోరాటాన్ని సాగించిన భారతీయ విప్లవకారుడన్నారు.ఆయన పోరాట పటిమ, విప్లవ కార్యాచరణ అనితర సాధ్యమని, అతని వీరోచిత సాహసకృత్యాలకు స్థానిక ప్రజలు అతనికి మన్యం వీరుడు, అగ్గి పిడుగు అనే బిరుదులను ఇచ్చారన్నారు. బ్రిటిష్ అధికారుల నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా పోరాడుతూ వారికి కంటిమీద కునుకులేకుండా చేసినాడన్నారు. విప్లవాన్ని అణచివేసేందుకు బ్రిటిష్ ప్రభుత్వం మన్యం ప్రజలను హింసిస్తుండడంతో ప్రాణత్యాగానికి సిద్దపడి లొంగిపోయి ఆంగ్లేయుల తూటాలకు తుదిశ్వాస విడిచారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ పి.విజయసారథి,జిల్లా ఎస్.బి ఇన్స్పెక్టర్ నారాయణ,అడ్మిన్ ఆర్.ఐ మౌలుద్దిన్,ఇతర పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు

దివ్యాంగులకు ట్రై స్కూటీలు పంపిణీ

విశాలాంధ్ర - సంతమాగులూరు : కామేపల్లిలో ఏర్పాటు చేసిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వం ఏడు ఉచిత ట్రై స్కూటీలు మంజూరు చేసింది.వాటిని మంత్రి గొట్టిపాటి చేతులు మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.ఈసందర్భంగా లబ్ధిదారులు సీఎం చంద్రబాబు,మంత్రికి,మండల కూటమి నేతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈకార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ తేలప్రోలు రమేష్,మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు సన్నెబోయిన గురుయాదవ్, మాజీ ఎంపీపీ సన్నెబోయిన ఏడుకొండలు,టీడీపీ నేతలు చేవూరి వాసురెడ్డి,కంచేటి మురళి,గమిడి కోటేశ్వరరావు,మాదాల సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

విశాలాంధ్ర - అద్దంకి : ఆర్టీసీ డిపోలలో ప్రయాణి కులకు మెరుగైన సౌక ర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటు న్నట్లు ఆర్టిసి నెల్లూరు జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం అద్దంకి ఆర్టీసీ డిపోను ఈడి ఆకస్మికంగా సందర్శించారు. బాపట్ల జిల్లా డిపిటిఓ సామ్రాజ్యం,అద్దంకి డిపో మేనేజర్ రామమోహన్‌రావు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర - రేపల్లె : మున్సిపల్ ఇంజనీరింగ్ ఒప్పంద కార్మికుల వేతనాలు పెంచాలని మున్సిపల్ కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని పర్మినెంట్ కార్మికులకు పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అనగాని శివప్రసాద్‌కు ఏఐటీయూసీ బాపట్ల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పడమటి బిక్షాలు,జిల్లా ఏఐటీయూసీ కౌన్సిల్ సభ్యులు సింగం వాణిశ్రీ, కార్మికులు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో ఔట్సోర్సింగ్ విధానముల పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు,పార్కు కూలీలకు,ఆఫీస్ సిబ్బందికి,టౌన్ ప్లానింగ్ సిబ్బందికి కేటగిరీల వారిగా రూ.21 వేలు,రూ. 24,500 వేతన ఒప్పందం జీవో నెంబర్ 36 ప్రకారం పెంచి కార్మికులకు అందజేయాలన్నారు.మున్సిపల్ కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 6 డిఎలు,రిటైర్డ్ అయిన కార్మికుల గ్రాడ్యుటి గ్రాడ్యుటి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. మున్సిపల్ ఔట్సోర్సింగ్ శుద్ధ కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలన్నారు.మున్సిపల్ కార్మికుల రిటైర్మెంట్ స్థానములోను, మున్సిపల్ కార్మికులు మరణిస్తే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని,పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లు,వాచ్మెన్లుకు కనీస వేతనం రూ.21 వేలు అమలు చేయాలన్నారు.మున్సిపల్ పారిశుధ్య కార్మికులకురూ.34 వేలు అమలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు బెజ్జం ముఖర్జీ,ముత్యాల దుర్గారావు,కన్నా ఏసుబాబు,దోవ వీరస్వామి,శీలం కోటయ్య,మద్దుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'అల్లూరి' జయంతి

విశాలాంధ్ర - పర్చూరు : మండల కేంద్రమైన పర్చూరులోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మన్యం,విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.అల్లూరి చిత్రపటానికి ఎంపీడీవో వి.ప్రద్యుమ్న కుమార్,ఈఓపిఆర్డీ కె.సత్యనారాయణ పూలమాల సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.ఎంపీడీవో మాట్లాడుతూ భారత స్వాతంత్ర సంగ్రామ పోరాటంలో స్వాతంత్రం కోసం బ్రిటిష్ వారిని ఎదిరించిన ధీశాలి అని కొనియాడారు.మన్యం ప్రజల్లో విప్లవ జ్యోతిని వెలిగించిన ధీరుడు అని తెలపారు. ముఖ్యంగా యువత దేశభక్తిని కలిగి ఉండాలని సూచించారు.అల్లూరి చిత్రపటం వద్ద ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది,వెలుగు కార్యాలయ సిబ్బంది ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయ సిబ్బంది పూలు చల్లి నివాళులర్పించారు.కార్యక్రమంలో సీనియర్ సహాయకులు వాసుదేవరావు,ఏపీఎం రామకృష్ణ,పర్చూరు పంచాయతీ కార్యదర్శి ఏ.మస్తాన్‌రావు,ఎంఈఓ పి.వెంకట్రామయ్య,వివిధ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఏల్చూరులో పీర్ల ఊరేగింపు

విశాలాంధ్ర - సంతమాగులూరు : మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకొని ఏల్చూరులోని చావిడి నుంచి పీర్లకు ఊరేగింపు నిర్వహించారు.శుక్రవారం ముస్లిం మతపెద్దలు,కమిటీ నిర్వాహకులు ఆధ్వర్యంలో యువకులు,చిన్నారులు పీర్లను ఎత్తుకొని మేళతాళాలు మధ్య గ్రామ పురవీధుల్లో ఉత్సవం చేపట్టారు.కులమతాలకు అతీతంగా మహిళలు, భక్తులు పీర్లకు వారుపోసి భక్తి పారవశ్యం చాటారు. బొరుగులు,శనగపప్పు,బెల్లం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.పీర్ల ఊరేగింపు తిలకించేందుకు ప్రజలు,చిన్న పిల్లలు ఆసక్తి చూపారు.

మురుగు శుద్ధి కర్మాగార నిర్మాణానికి స్థలం కేటాయింపు

విశాలాంధ్ర - జె.పంగులూరు : మండలంలో మండల స్థాయి మల మురుగు శుద్ధి కర్మాగారం నిర్మాణానికి ఎకరం స్థలాన్ని కేటాయించారని తహసిల్దార్ సింగారావు తెలియజేశారు.తూర్పు కొప్పెరపాడు గ్రామములోని సర్వే నంబర్ 299లోని ఎ 1.00 సెంట్స్ విస్తీర్ణము గల స్థలము కేటాయించి శుక్రవారం మండల అభివృద్ధి అధికారిని కే.స్వరూప రాణికి అప్పగించారు.

గ్రామాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - యద్దనపూడి : గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మండల టిడిపి అధ్యక్షులు నల్లపనేని రంగయ్య చౌదరి అన్నారు.మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.ఇంటింటికి వెళ్లి గ్రామస్థులతో కూటమి ప్రభుత్వ హయాంలో చేపట్టి పనులను,అభివృద్ధి కార్యక్రమాలను వివరించి కరపత్రాలను అందజేశారు.ఎలక్షన్స్ సమయంలో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చుతుందని,ఇప్పటికే కొన్ని నెరవేర్చిందన్నారు.ఈ కార్యక్రమంలో కనపర్తి నాగేశ్వరరావు,గుదే తారక రామారావు,రాయపాటి సీతయ్య,కొరటాల వంశీకృష్ణ,కోయ సతీష్,వజ్జా సుబ్బరామయ్య,కర్లపూడి నారాయణస్వామి,సింగ్ చంద్రశేఖర్ జంపని అంకమ్మ,తదితర తెదేపా నేతలు పాల్గొన్నారు.

పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర - అద్దంకి : తమ సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం అద్దంకి ఆర్టీసీ డిపో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి శివ శంకర్ మాట్లాడుతూ 11వ పిఆర్సీ అరియర్స్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు.ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ సిబ్బందితో నడిపించాలన్నారు.ఎన్నికల సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ ప్రకటించాలని,ఆర్టీసీ ఉద్యోగులకు విలీనం ముందున్న ఈహెచ్ఎస్ సౌకర్యాలు అమలు చేయాలని,అక్రమ పనిష్మెంట్ల విధానాన్ని నిలుపుదల చేయాలన్నారు.ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులకు వెంటనే అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు వహీద్,ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు

విశాలాంధ్ర - యద్దనపూడి : పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో గ్రామాలలో పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టారు. మండలంలోని అనంతవరం గ్రామంలో టిడిపి నాయకులు గుదే తారక రామారావు,కొరటాల వంశీకృష్ణలు గ్రామంలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పారిశుద్ధ్య పనులను ప్రారంభించారు.గ్రామీణప్రాంత ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు అధికారులు,ప్రజాప్రతి నిధులు ప్రత్యేక దృష్టి సారించారు.మురుగు నీటి పారుదల వ్యవస్థ మెరుగు పరచడం,చెత్తాచెదారం తొలగించేందుకు చర్యలు చేపట్టారు. అనంతరం గ్రామ కాలువల్లో మురుగు తొలగించారు.ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సహకారంతో స్వచ్ఛ గ్రామాలు నెలకొల్పడమే లక్ష్యంగా నాయకులు పనిచేస్తున్నారు. గ్రామంలోని స్మశాన వాటికలో ఉన్న చిల్ల చెట్లను పూర్తిగా తొలగించి శుభ్రపరిచారు.ఈ కార్యక్రమంలో నిమ్మల సాంబశివరావు,పోపూరి హనుమంతరావు,పోపూరి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

9న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

ఏఐటీయూసీ రేపల్లె ఏరియా గౌరవ అధ్యక్షులు గొట్టుముక్కల బాలాజీ

విశాలాంధ్ర - నిజాంపట్నం : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరశిస్తూ ఈ నెల 9 జాతీయ కార్మిక సంఘాలు నిర్వహించతలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రేపల్లె ఏరియా గౌరవ అధ్యక్షులు గొట్టుముక్కల బాలాజీ పిలుపునిచ్చారు.శుక్రవారం నిజాంపట్నం మండలం కూచినపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ దేశ సంపదను అంబాని,అదానిలకు దోచిపెడుతుందని ఆరోపించారు. కార్మికులు పోరాటాలు,ప్రాణ త్యాగాల ద్వారా సాధించుకున్న హక్కులను హరిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్లుగా తీసుకువచ్చి కార్మికులను కార్పొరేటర్లకు కట్టు బానిసలను చేస్తోందని బాలాజీ ఆగ్రహం వ్యక్తం చేశారు.లేబర్ కోడ్లను రద్దు చేసి,రద్దు చేసిన కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని,కనీస వేతనం అమలు చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కల్గించాలని బాలాజీ కోరారు.ఈ సమావేశంలో సిపిఐ శాఖ కార్యదర్శి బొర్రా నాగమల్లేశ్వరరావు,మహిళా సమాఖ్య రేపల్లె ఏరియా కన్వీనర్ క్రాప జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి వంగవీటి మోహన్‌రంగా

- మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పేదల కోసం ఎన్నో పోరాటాలు చేసి పేదల పెన్నిధిగా స్వర్గీయ వంగవీటి మోహనరంగా నిలిచారని బాపట్ల మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు.వంగవీటి మోహనరంగా జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని భీమావారి పాలెంలో ఉన్న ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి వైసీపీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ కేంద్రంగా బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు వారికి అమలు చేయాలని కోరుతూ ఎన్నో పోరాటాలు చేశారని చెప్పారు.తన తండ్రి కోన ప్రభాకరరావుతో రంగాకు మంచి పరిచయాలు ఉన్నాయని, ఆయనకు తన తండ్రి రాజకీయ గురువు అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్ బాబు,చాపల సుబ్రమణ్యం, కోకి రాఘవరెడ్డి,ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు,ఇనుపగొల్ల రంగారావు,సాంబ చెన్నకేశవులు,కొక్కిలిగడ్డ చెంచయ్య,జోగి రాజా,పాలపర్తి గోపికృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై పని భారం తగదు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : విద్యా శక్తి పేరుతో పాఠశాల పనివేళల తర్వాత సాయంత్రం 4 గంటల నుండి 5గంటల వరకు పాఠశాలల్లో పని చేయడాన్ని నిర్బంధం చేయవద్దని ఐచ్ఛికంగా పనిచేసే అవకాశం ఉపాధ్యాయులకు కల్పించాలని ఎస్టియు రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు వి.ప్రభాకర్ రావు అన్నారు.చీరాల మండలంలో ఎస్టియు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.అప్షన్ హాలిడే విషయంలో పాఠశాల మొత్తానికి ఇచ్చే విధంగా సూచించాలని,గత విద్యా సంవత్సరంలో సెలవు దినాల్లో పదవ తరగతి ప్రత్యేక క్లాసులు తీసుకున్న ఉపాధ్యాయులకు స్పెషల్ క్యాజువల్ లీవులు మంజూరు చేయాలన్నారు.ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చీరాల మండల బాధ్యులు ఎం.యేసురత్నం,తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు,కట్టా సుబ్బారావు,బత్తుల వెంకటేశ్వర్లు,జి.రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాస్తవాలు తెలుసుకోవాలి : కోన రఘుపతి

విశాలాంధ్ర - బాపట్ల : ప్రజల్లోకి వెళ్లినప్పుడు వారు చెప్పిన వాటిపై వాస్తవాలు తెలుసుకోకుండా విమర్శలు చేయటం చాలా హేయమైన చర్య అని మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ఆరోపించారు.కోన చాంబర్లో శుక్రవారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ కొద్దిరోజుల క్రితం పట్టణంలోని 9వ వార్డులో పర్యటిస్తున్న సందర్భంలో బోయన శివమ్మ అనే మహిళ పార్టీ మారలేదన్న అక్కసుతో పెన్షన్ తీసి వేసారని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన వర్మ మాట్లాడడం జరిగినదన్నారు.కానీ వాస్తవ పరిస్థితి చూస్తే ఆ మహిళకు ఒక కూతురు(బోయిన శిరీష) ఒక కొడుకు ఉన్నారు.నాడు జగనన్న ప్రభుత్వ హయాంలో ఆమె కూతురుకు టీచర్ ఉద్యోగం వచ్చిందన్నారు.టీచర్ ఉద్యోగం రావడంతో గవర్నమెంట్ నిబంధనల ప్రకారం పెన్షన్ ఆగిపోయింది,ఇది అసలు వాస్తవ పరిస్థితి,వాస్తవాలు తెలుసుకోకుండా బాపట్ల ఎమ్మెల్యే నోటికి ఏది వస్తే అది మాట్లాడడం కరెక్ట్ కాదన్నారు.మరి కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సరం కాలం గడుస్తున్న ఆ మహిళకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పెన్షన్ ఎందుకు ఇప్పించలేకపోయారో సమాధానం చెప్పగలరా అని ప్రశ్నించారు.ఇలా ప్రజల్లోకి వెళ్ళినప్పుడు తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రజలు ఎక్కడ నిలదీస్తారు అని అభద్రతాభావంతో ప్రతిపక్షం మీద ఆరోపణలు చేస్తూ కాలాన్ని వెళ్లబుచ్చుతున్నారని ఆయన విమర్శించారు.ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని దీనికి కచ్చితంగా ప్రజలే బుద్ధి చెప్తారు అన్నారు.

ఘనంగా 'అల్లూరి' జయంతి

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను శుక్రవారం పిట్టలవానిపాలెం ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి ఎంపీడీవో ఎలీషా బాబు,ఏపిఓ గణపతి,వెలుగు సీసీలు, కార్యాలయ సిబ్బంది కలిసి పూల మాలలు వేసి నివాళ్ళు అర్పించారు.అలాగే మండలంలోని భవనంవారిపాలెం గ్రామ పంచాయతీలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి గ్రామ సర్పంచ్ మోదుగుల శివ నాగేశ్వరి,6 వార్డు నెంబర్ మోదుగుల శంకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి,వీఆర్వో,సచివాలయ సిబ్బంది కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

డ్రోన్ సాయంతో మందు పిచికారి

విశాలాంధ్ర - చెరుకుపల్లి : ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులు ప్రారంభమవుతున్న తరుణంలో పంట కాలువలను శుభ్రపరిచే దిశగా నీటి సంఘాల అధ్యక్షులు పూనుకున్నారు.దీనిలో భాగంగా ప్రాజెక్టు కమిటీ అధ్యక్షులు మురళీధర్ రావు ఆదేశాల మేరకు స్థానిక నీటి సంఘ అధ్యక్షుడు గొగినేని రామాంజనేయులు ఆధ్వర్యంలో గూడవల్లి ఆర్.ఎం డ్రైన్‌లో దట్టంగా అలముకున్న తూటికాడను తొలగించేందుకు రసాయనాలను డ్రోన్ సహాయంతో పిచికారీ చేశారు.ఈ కార్యక్రమంలో గూడవల్లి రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌కు 155 అర్జీలు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య ఆదేశానుసారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.సంబంధిత అధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొతరపు జనార్దన్ రావు,గంజి పురుషోత్తం,కారంపూడి పద్మిని తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో సుపరిపాలనలో తొలి అడుగు

విశాలాంధ్ర- చీమకుర్తి: కూటమి ప్రభుత్వ పాలనలో సంవత్సర కాలం గడిచినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంటింటికి సుపరిపాలన కార్యక్రమాన్ని ప్రారంభించాలని పిలుపునివ్వడంతో చీమకుర్తి మండలం లో బాపట్ల నియోజకవర్గ టిడిపి ఉపాధ్యక్షులు మన్నం ప్రసాదు,సీనియర్ టిడిపి నాయకులు కాట్రగడ్డ రమణయ్య, టిడిపి చీమకుర్తి పట్టణ అధ్యక్షులు ముప్పూరి చలమయ్య, టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందరికీ అందాయా? అందలేదా అని? తెలుసుకుంటూ, కూటమి ప్రభుత్వ పాలన అందిస్తున్న సుపరిపాలన ప్రజలకు వివరిస్తూ,ఏ కూటమి ప్రభుత్వం అవ్వదాతలకు అందించేటువంటి 4000 రూపాయల పెన్షన్ అందరికీ అందాయో లేవో గమనిస్తూ?టిడిపి ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి అందజేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం గురించి తెలియజేస్తూ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు.

ఈ కార్యక్రమంలో వీరి వెంట టిడిపి నాయకులు,కార్యకర్తలు, ఉన్నారు.

ఘనంగా రోశయ్య జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర -చీమకుర్తి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రివర్యులు తమిళనాడు మాజీ గవర్నర్ స్వర్గీయ కొణిజేటి రోశయ్య 92వ జయంతి సభను శుక్రవారం చీమకుర్తి మండలం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వాసవి కళ్యాణ మండపం నందు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గవర్నమెంట్ హై స్కూల్ విద్యార్థులు వంద మందికి కంచాలు గ్లాసులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు చలువాది రమేష్ సెక్రటరీ మద్ది వెంకట్రావు, ట్రెజరర్ చలువాది పవన్,హరి ప్రియ గ్రానైట్ అధినేత నూనె వెంకటసు బ్రహ్మణ్యం,మాజీ అధ్యక్షులు ఆలపాటి నరసింహారావు,నూనె శివనాగేశ్వరరావు, నూనె హేమ సుందరం,జిల్లా సభ్యులు దుద్దు రంగనాయకులు, కొనిజేటి శ్రీనివాసులు,నూనె వంశీ,చలువాది ప్రసాద్, అద్దేపల్లి శ్రీనివాసరావు,చలువాది బాబాయ్,ఎల్లంపల్లి రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

పీర్ల గ్రామోత్సవం

విశాలాంధ్ర-పామూరు : హిందూ, ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించే మొహరం పండుగ లో భాగముగా శుక్రవారం సాయంత్రం పట్టణంలోని మూడు చావిడి ల నుండి మేళ తాళాలు, తప్పెట్లతో పేర్లు గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు బుంగలతో వారు పోసి పప్పులు, బొరుగులు, బెల్లం తో పేర్లకు నైవేద్యం సమర్పించారు.

ఆదర్శవంతంగా సామూహిక అక్షరాభ్యాస

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెం మండలం లోని అన్ని పాఠశాలలో నూతనంగా చేరిన ఒకటో తరగతి విద్యార్థులకు పండుగ వాతావరణం లో "సామూహిక అక్షరాభ్యాసం " కార్యక్రమాలు నిర్వహించి, చిన్నారుల తల్లిదండ్రులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు గ్రామస్తులు సమక్షంలో పండుగ వాతావరణం లో అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించినట్లు యంఇఒ అంజనేయులు తెలిపారు. యంపిపియస్ గురిజేపల్లి (మెయిన్) పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులను తల్లిదండ్రులు చక్కగా రడీ చేసి క్రమ శిక్షణతో పాఠశాలకు పంపించటం హర్షణీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సదుపాయాలు వనరులు ఉపయోగించుకోవాలనీ, తల్లికి వందనం అందరికీ చక్కగా ఉపయోగపడుతుందనీ, కేవలం డబ్బులనే కాకుండా విద్యార్థులకు ప్రభుత్వ - ప్రైవేటు పాఠశాలలలో ఏవి ఉపయుక్తంగా వుంటాయో చూడాలనీ, మేథో సంపత్తికి, మానసిక వికాసానికి ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల కృషి గమనించాలన్నారు. విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో ఏర్పడే భావనలే వారి జీవితం పై ప్రభావితం చూపుతాయనీ తల్లి తండ్రులు గమనించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో వారి మనోధైర్యాన్ని నింపుతూ, పాఠశాల అంటే భయం, కష్టంతో కాకుండా ఇష్టంగా వచ్చేటట్లు ప్రతీ ఉపాధ్యాయులు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 మల్లు నాయక్ , ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బయ్య, ఎస్ఎమ్సీ చైర్మన్ మల్లా రెడ్డి, ఉపాధ్యాయులు యస్. లలిత, శ్రీమతి గురవమ్మ, సునీత, అంగన్వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులను ఆదుకోండి

విశాలాంధ్ర-కనిగిరి : ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులను వేతనాలు పెంచి వారిని ఆదుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని సిపిఐ కార్యాలయం గుజ్జుల ఎలమందరెడ్డి భవన్ నందు జరిగిన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేదలుగా ఉన్న మధ్యాహ్న భోజన కార్మికులు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కనీసం కూలి రేట్లు కూడా వారికి దక్కటం లేదని అన్నారు. ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని వారికి వేతనాలు పెంచాలని అన్నారు ఈ సందర్భంగా ఏఐటిసి జిల్లా అధ్యక్షులు సయ్యద్ యాసీన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈ నెల 9వ తేదీ జరుగు సావిత్రి సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

వెలుగు ఏపీఎం ఎం.హనుమంతరావు

విశాలాంధ్ర-ముండ్లమూరు : వెలుగు పథకం ద్వారా ప్రతి మహిళ పొదుపు ద్వారా రుణాలు తీసుకొని ఆర్థికంగా బలపడాలని వెలుగు ఏపీఎం ఎం హనుమంతరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం గ్రామ సంఘ సహాయకుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సంఘ సహాయకులు సంఘాల్లో ఉన్న ప్రతి సభ్యులకిసంగం యొక్క ఆర్థిక లావాదేవీలు పైన అవగాహన కల్పించాలన్నారు. వారి యొక్క అప్పులు పొదుపుల పై అవగాహన కల్పించాలన్నారు. అంతర్గత ఆడిట్ చేయించడం ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్నటువంటి పథకాల గురించి సంఘ సమావేశాల్లో చర్చించి సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ లు కే కోటేశ్వరరావు, కే రత్నకుమారి, అకౌంటెంట్ జి మార్తమ్మ, సంఘాల్లోని సభ్యులు పాల్గొన్నారు.

ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - రేపల్లె : తమ సమస్యలను,డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిశీలించి ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్‌కు న్యాయం చేయాలని ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు పి.కమలాకర్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 4,5 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రేపల్లె డిపో ముందు ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డిపో సెక్రెటరీ డి.ఎస్ చిట్టిబాబు, ఉపాధ్యక్షులు వి.సాంబశివరావు,జాయింట్ సెక్రెటరీ మరక శ్రీనివాసరావు, గ్యారేజీ సెక్రెటరీ మౌలా ఖాన్,మల్లికార్జున్,సిసిఎస్ డెలిగేట్ సురగని శ్రీనివాసరావు,ట్రాఫిక్,గ్యారేజీ ఎంప్లాయిస్ నాయకుల పాల్గొన్నారు.

ఏడాదిలో ఒక్క పింఛన్ ఇవ్వకుండా విమర్శలా...

- వైసీపీ దివ్యాంగులు భాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య

విశాలాంధ్ర - బాపట్ల : టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాదికాలం గడుస్తున్న రాష్ట్రంలో ఏ ఒక్కరు కూడా పింఛన్ ఇవ్వకుండా కాలయాపన చేసిన చేతకాని ప్రభుత్వం కూటమిదే అని వైసిపి దివ్యాంగులు భాగం జిల్లా అధ్యక్షుడు చల్లారామయ్య విమర్శించారు.వైసీపీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాపట్ల 9వ వార్డులో దివ్యాంగురాలు బోయిన శివమ్మ కూతురుకు ప్రభుత్వ ఉద్యోగం ఉండగా నాడు ప్రభుత్వంలో ఆమెకు పింఛనును నిలిపివేయడం జరిగిందని తెలియజేశారు.ఆనాడు గ్రామ సచివాలయంలో దివ్యాంగురాలైన బోయిన శివమ్మ ఆమె కూతురి పేరును తన రేషన్ కార్డులో నుంచి తొలగించి మళ్లీ అర్హురాలిగా పింఛను దరఖాస్తు చేసుకున్నదని నేడు కూడా ఆమె పేరు సెలక్షన్ లిస్టులో ఉన్నదని తెలిపారు.కూటమిలోని నాయకులు చెప్పిన మాటలను విని వాస్తవాలు తెలియకుండా ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ బాపట్ల మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతిపై నిరాధారమైన ఆరోపణలు చేయటాన్ని ఖండిస్తున్నామని తెలియజేశారు.కూటమి ప్రభుత్వం వచ్చి రాష్ట్రంలో ఉన్న వికలాంగులకు మళ్ళీ సదరం సర్టిఫికెట్లని ప్రభుత్వాసుపత్రి చుట్టూ తిప్పుతూ అనేక ఇబ్బందులు పెడుతున్నారని సీఎం చంద్రబాబు ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచిన వార్డు సచివాలయంలో రాష్ట్రంలో ఉన్న అర్హులైన వికలాంగులు వృద్ధులు 50 సంవత్సరాలు నిండిన వారు వార్డు సచివాలయంలో దరఖాస్తు పెట్టుకున్నా కూడా కొత్త పింఛన్ ఒక్కటైనా మంజూరు చేశారా అని ఎమ్మెల్యే నరేంద్రవర్మను ప్రశ్నించారు. దివ్యాంగురాలు శివమ్మకు కూడా పింఛను త్వరగా రావాలంటే కూటమి ప్రభుత్వం నుంచే కొత్త పింఛన్లు మంజూరు చేయాలని చల్లా రామయ్య డిమాండ్ చేశారు.మాజీ సీఎం జగనన్న ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేశారని రామయ్య గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ దివ్యాంగుల విభాగం అధ్యక్షురాలు మల్లెల మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి రంగా జయంతి

విశాలాంధ్ర-పొన్నలూరు : మండల కేంద్రమైన పొన్నలూరులో శుక్రవారం వంగవీటి రంగ 78వ జయంతి వేడుకలు కొండపి నియోజకవర్గం నాయకుడు తాటి యల్లమంద ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా రంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : అల్లూరి సీతారామరాజు 128 జయంతి సందర్భంగా బాపట్ల సూర్యలంక రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి బాపట్ల జిల్లా టిడిపి అధ్యక్షులు బాపట్ల బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో అల్లూరి సీతారామరాజు పాత్ర చిరస్మరణీయం అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి,క్షత్రియ సేవా సంఘం నాయకులు కార్లమూడి భాస్కర్ రాజు,మంతెన ఆనంద భూపతి రాజు,బుద్ధ మాజీ ఉపసర్పంచ్, గోకరాజు రామ కృష్ణంరాజు,రామ్మూర్తి రాజు,జయనాగరాజు, జనసేన బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త నామన శివన్నారాయణ,ఎం.ఎస్ కృష్ణ,బంగారు బాబు తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల వ్యవసాయ కళాశాలలో : భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో అల్లూరి సీతారామ రాజు పాత్ర చిరస్మరణీయమైనదని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూన రాణి అన్నారు.నేటి యువత ఆయన ధైర్య సాహసాలను ఆదర్శంగా తీసుకొని జాతి మనుగడకు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బోధన,బోధనేతర సిబ్బంది,విద్యార్థిని విద్యార్థులు పాల్గొని అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు.

బాపట్ల పురపాలక సంఘం కార్యాలయంలో : పురపాలక సంఘ కార్యాలయంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మునిసిపల్ కమిషనర్ జి.రఘునాథ రెడ్డి,చీరాల మునిసిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్,అద్దంకి మునిసిపల్ కమిషనర్ డి.రవీంద్ర,పూలమాలల ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ పి.లక్ష్మయ్య, మున్సిపల్ ఇంజనీర్ ఎస్.ఎస్.కృష్ణారెడ్డి పురపాలక సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయంలో : అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా శుక్రవారం కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయంలో సీతారామరాజు చిత్రపటానికి ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు పూలమాలవేసి నివాళులర్పించారు.

నివాళులర్పించిన వారిలో ఈఓపిఆర్డి శ్రీనివాసరావు,సూపరిండెంట్ రజిని,శ్రీనివాసరావు,ఏవో సుమంత్ కుమార్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది,కార్యదర్శులు ఉన్నారు.

రంగాను యువత ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : దివంగత నాయకులు వంగవీటి మోహన రంగా 78వ జయంతి వేడుకలు బాపట్లలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భీమావారిపాలెంలో వంగవీటి మోహన రంగా విగ్రహానికి కాపు సేవా సంఘం నాయకులు,జనసేన పార్టీ నాయకులు విస్సకోట సురేష్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంగవీటి మోహన రంగా బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో లేళ్ళ తులసి కుమారి,కారుమూరి ఆంజనేష్,గొట్టిపాటి శ్రీకృష్ణ,బీమా వెంకటేష్,రంగా అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'పింగళి'కి ఘన నివాళులు

విశాలాంధ్ర - నిజాంపట్నం : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆదర్శప్రాయుడని తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు,ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి కొనియాడారు.స్వాతంత్ర్య సమరయోధుడు,మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను శుక్రవారం స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటాలకు తహసీల్దార్ శ్రీనివాసరావు,ఎంపీడీవో నాగలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అలాగే ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పింగళి వెంకయ్య చిత్రపటానికి ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంచార్జి ఏఓ టి.లక్ష్మీకాంతమ్మ,పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు,జూనియర్ అసిస్టెంట్ ఎ.రామకృష్ణ, సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నా తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హరిత రాయబారులకు సామగ్రి పంపిణీ

విశాలాంధ్ర - సంతమాగులూరు : ఏల్చూరు పంచాయతీ పరిధిలోని హరిత రాయబారుల(పారిశుద్ధ్య కార్మికులు)కు సామగ్రి హెల్మెట్,చేతి గ్లౌజు,మాస్కులు,ఏకరూప దుస్తులను ప్రభుత్వం మంజూరు చేసింది.శుక్రవారం పంచాయతీ ఆఫీసులో కార్యదర్శి ఎంవీ పూర్ణచంద్ అధ్యక్షతన కార్మికులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల టీడీపీ నేత దుద్దేల చిన్న గాలెయ్య చేతులు మీదుగా సామగ్రిని కార్మికులకు అందజేశారు.గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వీధుల్లో సేకరించిన చెత్తాచెదారాన్ని డంపింగ్ యార్డుకు తరలించాలని కార్మికులకు సూచించారు.ఈకార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ఎస్కే అమీన్,బి.మహాలక్ష్మి,సీహెచ్.రవి పాల్గొన్నారు.

నూతన డిఐఈవోను కలిసిన అధ్యాపకులు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇంటర్ విద్యాశాఖ అధికారి జుబేర్‌ని ఆధ్యాపకులు శుక్రవారం మర్యాద పూర్వ కంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కే.అంకినీడు, యద్దన పూడి సివిక్స్ లెక్చరర్ సుధాకర్ రెడ్డి,పిట్టలవానిపాలెం ఫిజికల్ డైరెక్టర్ సుబ్బారావు,హిందీ లెక్చరర్ విజ్ఞాన్ కుమార్,రిటైర్డ్ పిడి జె. సుబ్బారావు,రికార్డ్ అసిస్టెంట్ పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

ఆర్టీసీలో ఖాళీలను భర్తీ చేయాలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బస్ డిపోలలో అన్ని కేటగిరీలలో ఖాళీలను భర్తీ చేసి,వెంటనే ప్రమోషన్స్ ఇవ్వాలని ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ బిటి వలి డిమాండ్ చేశారు.ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ ఆదేశాల మేరకు జిల్లా కార్యదర్శి కామ్రేడ్ వైయస్ రావు ఆధ్వర్యంలో బాపట్ల బస్ డిపో,కొత్త బస్టాండ్‌లో ఉదయం 4:30గంటల నుంచి ఎర్ర బ్యాడ్జీలు ధరించి ఉద్యోగులు విధులకు హాజరై మధ్యాహ్నం 12:30 వరకు ధర్నా నిర్వహించారు.బాపట్ల డిపో యూనియన్ అధ్యక్షులు కామ్రేడ్ టి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు.బిటి వలి మాట్లాడుతూ బస్ డిపోలలో అన్ని కేటగిరీలలో ఖాళీలను భర్తీ చేసి,వెంటనే ప్రమోషన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఐఆర్ ప్రకటించి వెంటనే 12వ పి.ఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలని ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ప్రభుత్వాని కోరారు.ఆర్టీసీ పద్ధతి లోనే వైద్య సౌకర్యం కల్పించాలని ఎస్ఆర్‌బిఎస్,ఎస్‌బిటి బకాయిలను వెంటనే చెల్లించాలని, సిసిఎస్ ఆఫీస్ తరలింపు మానుకోవాలన్నారు.అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉన్న ఇబ్బందులను తొలగించాలని కోరారు.1/2019 సర్క్యులర్‌ను యధావిధిగా అమలు చేయాలని,క్లరికల్,సూపర్వైజర్ సమస్యలను పరిష్కరించాలని,మహిళలకు ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం కొరకు అదనంగా నూతన బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని,ఖాళీగా ఉన్న దాదాపు పదివేల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గ్యారేజ్ కార్యదర్శి కామ్రేడ్ చలపతి,వైయస్ రావు,కండక్టర్లు,డ్రైవర్లు,గ్యారేజి సిబ్బంది ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకాన్ని వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - జె.పంగులూరు : జె.పంగులూరులోని స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామ సంఘాల అధ్యక్షులు,గ్రామ సంఘాల వివోలకు సమీక్ష సమావేశం మండల సమాఖ్య అధ్యక్షురాలు మాధవి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశానికి ఎంపిడిఓ స్వరూపరాణి హాజరైయ్యారు. ముఖ్యంగా ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని దీని మొత్తం యూనిట్ కాస్టు రూ.రెండు లక్షల 20 వేలు లబ్ధిదారుల వాటా కింద రూ.20 వేలు తక్షణమే చెల్లించాలని అలాంటి వారికి 78,000 యూనిటీ బిగించిన 15 రోజుల తర్వాత సబ్సిడీ అమౌంటు లబ్ధిదారుల ఖాతాలో జమగాటం జరుగుతుందన్నారు.బిసి కులాలకు అయితే అదనంగా రూ.20 వేలు అనగా మొత్తం బీసీలకు రూ.98 వేలు సబ్సిడీ మొత్తం వస్తుందని దీన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని తెలియజేశారు.ఏపిఎం కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్క వివోవి లబ్ధిదారులను గుర్తించి రిజిస్ట్రేషన్ చేయించాలని తెలియజేశారు.స్త్రీ నిధి బ్యాంకు నుండి రుణాలు తీసుకున్న సంఘాల వారు సక్రమంగా వాయిదాలు చెల్లించాలని,ఎన్పీవి ఉన్న గ్రామ సంఘాల వారికి,గ్రూపులకు నోటీసు జారీ చేయాలని అధ్యక్షురాలు ఆమోదంతో తెలియజేశారు.తీసుకున్న రుణాలను జీవనోపాదులు పెంపొందించుకొనుటకు ఉపయోగించుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్త్రీ నిధి మేనేజర్ నాగ శంకర్ సీసీలు సాల్మన్, సురేష్,చంద్రశేఖర్ వివిధ గ్రామ సంఘాల నుండి వచ్చిన అధ్యక్షులు వివోఏలు పాల్గొన్నారు.

అడవులదీవి ఎస్సైగా బాబూరావు

విశాలాంధ్ర - నిజాంపట్నం : మండలంలోని అడవులదీవి పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా బత్తుల బాబూరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.ఒంగోలు సీసీఎస్‌లో పని చేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా అడవులదీవి స్టేషన్‌కు వచ్చారు.ఈ సందర్భంగా బాధ్యతలు చే పట్టిన ఎస్సై బాబురావు మాట్లాడుతూ శాంతి భద్ర తలు పరిరక్షించేందుకు నిరంతరం కృషి చేస్తానని చెప్పారు.నూతన ఎస్సై బాబురావుకు పోలీస్ సిబ్బంది, పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పారిశుద్ధ్య సిబ్బందికి శానిటరీ కిట్లు అందజేత

విశాలాంధ్ర - చెరుకుపల్లి : గ్రామాలలో పారిశుద్ధ్య కార్మికుల చేస్తున్న సేవలు వెలకట్టలేనివని మండల అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ సుభాని అన్నారు.శుక్రవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని గ్రామ పంచాయతీల పారిశుద్ధ్య కార్మికులకు సానిటరీ కిట్లు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపద తయారీ కేంద్రాలలో పనిచేస్తున్న షెడ్డు మిత్ర,క్లాపు మిత్రలకు ఈ కిట్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు.ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి కేజీవి శ్రీనివాసన్,చెరుకుపల్లి,గుళ్ళపల్లి కార్యదర్శులు ఈవూరు విజయబాబు, గొలకారం మురళీకృష్ణ,మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది,కార్మికులు పాల్గొన్నారు.